
ప్రజాశక్తి

మంగళవారం 17 డిసెంబర్ 2024




పకడ్బందీగా పీసా ఎన్నికలు

ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలోని 41 పంచాయతీల్లో పీసా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 31వ తేదీలోపు 102 గ్రామసభలు నిర్వహించి, ఉపాధ్యక్షులను, కార్యదర్శిని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. పీసా గ్రామసభలకు ఓటు హక్కు ఉన్నవారు సభ్యులుగా ఉంటారని తెలిపారు. సమావేశానికి కోరం గ్రామసభ సభ్యుల్లో 1/3వ వంతు కంటే తక్కువ ఉండకూడదని, వీరిలో కనీసం 50 శాతం గిరిజన సభ్యులు ఉండాలని చెప్పారు. పీసా ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు, ఇతర అధికారులకు శిక్షణ ఇప్పించామని తెలిపారు.



ఫ్లడ్ లైట్ల సహాయంతో వెళ్తున్న ఆర్‌టిసి బస్సు

మన్యంపై చలి పంజా

మన్యంపై చలి పంజా విసురుతోంది. పొగమంచు పూర్తిగా కమ్ముతోంది. మరోవైపు చల్లని గాలులు వీస్తుండటంతో ఎముకలు కొరికే చలి ప్రజల్ని వణికిస్తోంది. ఉదయం 8 గంటలు దాటినా ప్రజలు బయటకు రావడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. గతేడాది ఇదే రోజుల్లో రాత్రి వేళల్లో 22 నుంచి 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవగా ఇప్పుడు 20 నుంచి 19 డిగ్రీలకు పడిపోతున్నాయి. సోమవారం 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లోనూ ఇదే కొనసాగే అవకాశం కనిపిస్తోంది. దీంతో ప్రస్తుతం అనారోగ్య సమస్యలు ఎక్కువగా బయట పడుతున్నాయి.

- భారీగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కమ్ముతున్న పొగమంచు
- అనారోగ్యం బారిన గిరిజనం

ప్రజాశక్తి- కురుపాం

మన్యంలో వాతావరణంలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు 27 నుంచి 28 డిగ్రీల వరకూ నమోదవుతుండగా, రాత్రి వేళల్లో మాత్రం 20 నుంచి 14 డిగ్రీలకు పడిపోతున్నాయి. దీంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత ఉదయం 8 గంటలు దాటినా తగ్గడం లేదు. ఈ చలి తీవ్రత రాబోవు రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందంటున్నారు.

పొగమంచుతో ఇబ్బందులు

చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు పొగమంచు కురుస్తుండడంతో తెల్లవారుజాము నుంచి 7 గంటల వరకూ రహదారుల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. నిత్యం చిరు వ్యాపారులు వ్యాపార నిమిత్తం మండల కేంద్రం నుంచి గిరిజన గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గిరిజనులు సైతం తమ ఉత్పత్తులను మండల కేంద్రానికి, వివిధ కూడళ్లకు తీసుకొస్తుంటారు. వీరంతా సైకిళ్లు, మోటారు వాహనాలపై రావాల్సి వస్తుండటంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మంచు ధాటికి ద్విచక్ర, పెద్ద వాహనాలు నడపడం డ్రైవర్లకు కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో పొగమంచు వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని భయాందోళనకు గురవుతున్నారు.

ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ

చలి తీవ్రత అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో స్వెట్టర్లకు, ఉన్ని దుస్తులకు భారీగా డిమాండ్ పెరుగుతోంది, మండల, జిల్లా కేంద్రాల్లో భారీగా స్వెటర్లు, ఉన్ని దుస్తులు అమ్మకపుదార్లు పెద్ద సంఖ్యలో దుకాణాలను నెలకొల్పి వ్యాపారాలు సాగిస్తున్నారు. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పలువురు వాటి కొనుగోలుకు క్యూ కడుతున్నారు.



చలి మంట కాగుతున్న చిన్నారులు

మరింత అప్రమత్తం

శీతాకాలంలో చిన్నారులు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా నిమోనియా వచ్చే ప్రమాదముంది. నిత్యం వేడి పదార్థాలను మాత్రమే తీసుకోవాలి. కోవిడ్ నుంచి కోలుకున్న వారు మాస్కు ధరిస్తే మేలు. వీరికి ఆయాసం వచ్చే అవకాశం ఉంది. ఊపిరితిత్తుల సమస్యలు ఎదురవుతాయి. జాగ్రత్తలు పాటించాలి. ఇన్ఫెక్షన్ కారణంగా నిమోనియా వస్తుంది. దీని వల్ల జ్వరం, దగ్గు, జలుబు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లకూడదు. చల్లని పదార్థాలను తీసుకోకూడదు.

- కె.సందీప్ కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు



ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పిసిసిఎఫ్ చిరంజీవి చౌదరి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జిల్లాలో పిసిసిఎఫ్ పర్యటన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పిసిసిఎఫ్), ఫారెస్ట్ ఫోర్స్ హెడ్ చిరంజీవి చౌదరి, అటవీ సంరక్షణాధికారి మహ్మద్ దివాన్ మైదీన్ సోమవారం జిల్లాలో పర్యటించారు. జియ్యమ్మవలస మండలం పెదకుదుమలో ఏనుగుల పరిస్థితిని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి చిరంజీవి చౌదరి పరిశీలించారు. సమస్యను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు. జిల్లాలో ఏనుగుల పరిస్థితిని కలెక్టర్.. ఆయనకు వివరించారు. సీతానగరం మండలం గుచ్చిమి గ్రామం వద్ద నాటిన మొక్కల పరిస్థితి గమనించారు. ఏనుగులను ఆ ప్రాంతంలో పెట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. పెదకుదుమ ప్రాంతంలో ఎంత భూభాగంలో ఏనుగుల సంచారం ఉందో గమనించారు. తద్వారా తీసుకోవాల్సిన చర్యలను గురించి పరిశీలించారు. ఏనుగుల వల్ల ఎదురవుతున్న సమస్యలను రైతులు పిసిసిఎఫ్‌కు వివరించారు.

పంటలకు భారీ నష్టం వాటిల్లుతుందని, నష్టపరిహారం సకాలంలో అందడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి జివిపి ప్రసూన, టిడిపి మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, డంగబద్ర సర్పంచ్ జోగి భుజంగరావు, అటవీశాఖ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లల చదువులెలా?

- అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు తీర్చండి
- దీక్షలకు మద్దతు తెలిపిన విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, తమ పిల్లలకు చదువులు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరానికి వచ్చి, ఉపాధ్యాయులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పిల్లలు జోగింపేట గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలో చదువు తున్నారని చెప్పారు. నెల రోజులుగా కొన్ని సబ్జెక్టులో ఉపాధ్యాయులు, అధ్యాపకులు లేక పిల్లలు వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పది, ఇంటర్, జెఇఇ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యా బోధన లేకపోతే ఎలా? అని వాపోయారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించి, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ఆమోదించి, వారి సమ్మె విరమింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు నిర్మల, జి.గంగమ్మ, బి.టి.దొర, కె.చిట్టిబాబు, పి.పోతు రాజు, ఎం.బుడేందొర, జి.నాగార్జున పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షకు శ్రామిక మహిళా సంఘం నాయకురాలు బొత్స లక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మద్దతు తెలిపారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, రమేష్, కామేష్, వెంకట్, హరిబాబు, లక్ష్మి, అనిత, కవిత, బిందు, హుస్సేన్, మోహన్, సురేష్, జగదీష్, సింహాచలమమ్మ, రెల్లమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులకు వినతులు అందిస్తున్న గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

ప్రత్యామ్నాయం చూపే వరకు ఉపాధి కల్పించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, తోపుడు బండ్ల వ్యాపారులు

తోపుడు బండ్ల వ్యాపారుల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్రత్యామ్నాయం చూపించే వరకు ఉపాధి కల్పించాలని తోపుడుబండ్ల, చిల్లర వర్తకుల సంక్షేమ సంఘం (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యాన తోపుడుబండ్ల, చిరు వ్యాపారులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. తొలుత నాలుగు రోడ్ల కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రీవెన్స్‌లో డిఆర్‌ఒ హేమలతను కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దావాల రమణారావు, వై.మన్మథరావు, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, వి.ఇందిర మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసులు తోపుడు బండ్లను తొలగిస్తున్నారని చెప్పారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న తోపుడుబండ్ల, చిల్లర వర్తకులు 18 రోజులుగా ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యాపారాలు లేక తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక పోతున్నారని వాపోయారు. ప్రత్యామ్యాయం చూపించే వరకు వ్యాపారాలు చేసుకోనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, సిపిఎం జిల్లా నాయకులు బివి రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాకల సన్యాసిరావు, సంచాన ఉమామహేశ్వరరావు, శ్రామిక మహిళ నాయకులు బి.లక్ష్మి, తోపుడు బండ్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు బంకురు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సొంత సమస్యగా భావించండి

48 గంటల్లోగా పరిష్కారం చూపాలి ● అధికారులకు జాయింట్ కలెక్టర్ శోబిక ఆదేశం ● గ్రీవెన్స్‌కు 133 వినతులు

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను తమ సొంత సమస్యగా భావించి నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. 48 గంటల్లోగా ప్రతి సమస్యా పరిష్కారం కావాలని సూచించారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని, బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను జెసి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో డిఆర్‌ఒ కె.హేమలత భాగస్వామ్యం అయ్యారు. వివిధ ప్రాంతాలకు చెందిన 133 మంది అర్జీదారులు తమ వినతులను అందించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి జెసి మాట్లాడుతూ ప్రతీ సమస్యను తమ సొంత సమస్యగా భావించినప్పుడే, శాశ్వత పరిష్కారం చూపగలుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్జీల పరిష్కారం వేగవంతం చేసే ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకూ తావివ్వరాదని ఉద్బోధించారు. వచ్చిన అర్జీల్లో కొన్ని..

జియ్యమ్మవలస మండలం అప్పన్నదొరవలస గ్రామంలోని మంగళబంద చెరువులో చెడు వ్యర్థాలు వేస్తున్నారని సర్పంచ్ వి.మన్మథ, గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని మెయిన్ రోడ్డుపై పశువు లను కట్టి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కల్పించడం, వీధి కాలువల ఏర్పాటుకు వీలు లేకుండా స్థలాలను ఆక్రమించారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జెసికి ఫిర్యాదు చేశారు.

పార్వతీపురం మండలం చిన్నబొండపల్లిలో చెరువు ఆక్రమణ, గట్టుపై ఉన్న ఆక్రమ కట్టడాలను, నీరు వచ్చే గెడ్డను ఆక్రమించారని, సర్వే చేపట్టి ఆక్రమణలను తొలగించాలని బి.పోలినాయుడు వినతి అందించారు.


తోటపల్లి ప్రాజెక్టులో 2015 నుంచి వార్షిక నిర్వహణ సిబ్బందిగా పనిచేస్తున్న తమకు జీతాలు సక్రమంగా అందడం లేదని, ఆప్కాస్‌లో తమను విలీనం చేసి, ప్రతి నెలా జీతాలు అందేలా చూడాలని ఎం.జగన్‌మోహన్ రావు, తదితర సిబ్బంది అర్జీని అందజేశారు.

పాలకొండ మండలం తుమరాడ జగనన్న కాలనీలో పైనుంచి 11 కెవి విద్యుత్ లైన్లు వెళ్లిన కారణంగా ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయని, వాటిని తొలగిస్తే ఇళ్లు కట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలియజేస్తూ దూబ లక్ష్మి, ఇతరులు వినతి పత్రాన్ని అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఎస్.మన్మథరావు, ఎల్‌డిఎం జె.ఎల్.ఎన్.మూర్తి, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతయ్య, జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.ఎస్.వర ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు, డిపిఆర్‌ఒ ఎల్.రమేష్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎం.ఎన్.రాణి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శోబిక



డిఆర్‌ఒకు సమస్యలను వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, జిల్లా నాయకులు సాంబమూర్తి

రైతుల సమస్యలపై సిపిఎం వినతి

జిల్లాలో రైతులతోపాటు జంఝావతి ఆయకట్టుదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అధికారులను కోరారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో డిఆర్‌ఒ హేమలతను రైతులతోపాటు కలిసి వినతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొమరాడ మండలంలో జంఝావతి కాలువపై అరటి, పత్తి మొక్కలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కురుపాం, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. కొమరాడ మండలం మండ పంచాయతీ జాకూరు గ్రామంలో దశాబ్దాలుగా కొండ భూమిపై సాగుచేస్తున్న గిరిజన రైతులను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దగెడ్డ జలాశయం కారణంగా సర్వం కోల్పోయిన తమని ప్రభుత్వం ఆదుకోవాలని పాచిపెంట మండలం కొటికిపెంట గ్రామ నిర్వాసితులు గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. కొటికిపెంట సర్పంచ్ అప్పలనాయుడు, నిర్వాసితుల సంఘం నాయకులు సత్యనారాయణ, కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన యువకులు ఫిర్యాదు చేశారు. పెద్దగెడ్డ జలాశయ నిర్మాణ సమయంలో నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేశారని చెప్పారు. అయితే కొంతమంది నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన పేర్లకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిహారం అందకపోవడంతో నిర్వాసిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాయని చెప్పారు. వెంటనే వారిని ఆదుకోవాలని కోరారు.

డైలీవేజ్ వర్కర్‌ని విధుల్లోకి తీసుకోవాలి

మక్కువ మండలం కాశీపట్నం కెజిబివిలో పనిచేసిన డైలీవేజ్ వర్కర్ టి.జ్యోతిని కేవలం రాజకీయ వేధింపులతో తొలగించారని, ఆమెని తిరిగి ఉద్యోగం లో చేర్చుకోవాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. బాధిత మహిళ జ్యోతితో కలిసి వారు గ్రీవెన్స్‌లో జెసి శోబికకు వినతిపత్రం అందజేశారు. 2016 నుంచి పని చేస్తున్న డైలీ వేజ్ వర్కర్ టి.జ్యోతిని ఇటీవల తొలగించారని, అధికారపార్టీ నాయకుల ఒత్తిడి మేరకే ఆమెని నిలిపివేశారని చెప్పారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు అనారోగ్యంతో బాధపడుతున్న కుమార్తెకు వైద్యం చేయించుకునేవారని, ఇటీవల ఆమె కుమార్తె మృతి చెందిందని చెప్పారు. జ్యోతిని తిరిగి డైలీ వేజ్ వర్కర్‌గా నియమించాలని వారు డిమాండ్ చేశారు.

ఆధార్ కేంద్రాలు పునరుద్ధరించాలి

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని 1, 5వ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను పునరుద్ధరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా మహేశ్వరరావు.. గ్రీవెన్స్‌లో డిఆర్‌ఒ హేమలతకు వినతి అందించారు. అపార్ ఐడి నమోదు కోసం ఆధార్ కార్డుల్లో సవరణలకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే పై సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేసేలా చూడాలని కోరారు.

భూసమస్య పరిష్కరించకుంటే
చావే శరణ్యం

గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేసిన రైతు

తనతోపాటు 15 మంది రైతులకు సంబంధించిన భూసమస్యని వెంటనే పరిష్కరించాలని, లేకపోతే తనకు మరణమే శరణ్యమని సీతానగరం మండలం మరిపివలస గ్రామానికి చెందిన రైతు రామినాయుడు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తితో కలిసి ఆయన డిఆర్‌ఒ హేమలతకు వినతిపత్రం అందజేశారు. మరిపివలస నుంచి నిడగల్లు గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న తన భూమి, మరికొంత మందికి చెందిన జిరాయతీ భూమి సుమారు 30 ఎకరాలు.. 22ఎ జాబితాలో నమోదైందని చెప్పారు. తన కుమార్తె పెళ్లి నిమిత్తం భూమి అమ్ముకోవాల్సి ఉందని, 22ఎ నుంచి తొలగించాలని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదని ఆయన వాపోయారు. తన భూసమస్యను పరిష్కరించకపోతే కుమార్తె పెళ్లి చేయలేనని, అలాంటి పరిస్థితుల్లో ఆత్మహత్యే శరణ్యమని రైతు రామినాయుడు ఆవేదన వ్యక్తంచేశారు. సమస్య వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగు నాయుడు, సాంబమూర్తి కోరారు. దీనిపై స్పందించిన డిఆర్‌ఒ హేమలత.. సీతానగరం తహశీల్దార్‌తో ఫోన్ లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిబంధనలకు విరుద్ధంగా కార్యదర్శుల బదిలీలు

పార్వతీపురం రూరల్ : ఈ ఏడాది సెప్టెంబర్‌లో చేపట్టిన పంచాయతీ కార్యదర్శుల బదిలీలు నిబంధనలకు విరుద్ధంగా సాగాయని, దీనిపై దర్యాప్తు చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు వంగల దాలినాయుడు.. గ్రీవెన్స్‌లో డిఆర్‌ఒకు వినతి అందించారు. కార్యదర్శుల బదిలీల ప్రక్రియ లో అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. అధికార బలం, రాజకీయ పలుకుబడి ఉన్న వారికే కోరిన స్థలాలకు బదిలీలు చేశారని తెలిపారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి- బొబ్బిలి

తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యా రంగ పరిరక్షణకు, అధ్యాపక, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి అన్నారు. స్థానిక తాండ్రపాపారాయ మున్సిపల్ పాఠశాలలో సోమవారం ఎన్నికల కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై నికరంగా, నిరంతరంగా కృషి చేసే అవకాశం తనకు ఇవ్వాలన్నారు. అన్ని స్థాయిల్లో పదోన్నతుల విషయంలో అడ్‌హాక్ పద్ధతిలోనే ప్రమోషన్ ఛానల్‌లో ఓపెన్ చేయాలని ప్రత్యామ్నాయం కోసం కృషి చేస్తామన్నారు. 117 జిఒ, సిపిఎస్ రద్దు వంటి దీర్ఘకాలిక అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, కెజిబివి, మోడల్ స్కూల్స్, జ్యోతిరావు పూలే పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలపై, మినుమం టైం స్కేలు సాధన కై కృషి చేస్తానని, కాంట్రాక్టు లెక్చరర్లకు 114 జిఒ అమలుకు కృషి చేస్తామని చెప్పారు. విద్యారంగంపై సమగ్రమైన అవగాహన ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, సత్యన్నారాయణ, అనె శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, సుధాకర్, అప్పలనాయుడు, మహేష్, అనంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి గిరిజనుల ఇక్కట్లు

ప్రజాశక్తి- మెంటాడ

కూనేరు పంచాయతీ మధుర గిరిజన గ్రామం ఎగువమిర్తి వలస గిరిజనులు తాగునీరు లేక, గ్రామానికి రహదారి లేక ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటికి సుదూర ప్రాంతాలకు వెళ్లి ఊటనీరు తెచ్చి వంటలకు తాగటానికి ఉపయోగించుకొని కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఊట నీరు తాగడం వల్ల రోగాలకు గురవుతున్నారు. రోగాల బారిన పడి నయం చేసుకోవడం కోసం ఆసుపత్రులకు రావాలన్నా సరైన రహదారి లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఎగువమిర్తి వలస గిరిజన గ్రామాల ప్రజలు సిపిఎం నాయకులు రాకోటి రాములు ఆధ్వర్యంలో ఎంపిడిఒ బిఎస్‌కె పట్నాయక్‌కు కార్యాలయంలో ఈ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పోయిరి అప్పలస్వామి, సారా అడవి రాజు, పోయిరి లచ్చయ్య తదితర గిరిజనులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి -సీతంపేట

108 వాహనంలో సోమవారం ఓ మహిళ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఆంటీకొండ పెద్దగూడకు చెందిన సవర సంధ్యారాణికి పురిటినొప్పులు వస్తున్నాయని కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న సీతంపేట 108 సిబ్బంది హుటాహుటిన బయలుదేరి గ్రామానికి చేరుకున్నారు. ఆమెను అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తీసుకొస్తుండగా, ఈతమానుగూడ దగ్గరకు వచ్చేసరికి నొప్పులు ఎక్కువయ్యాయి. ఇఎంటి రాములు, ఆశ, పైలట్ రవికుమార్ సహాయంతో డెలివరీ చేయించారు. ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చారు. అనంతరం సీతంపేట ఏరియా ఆసుపత్రికి తల్లి, బిడ్డను తరలించారు.



అధికారులు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ముగ్గురే ముగ్గురు

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ముగ్గురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. మండల విద్యాశాఖ, పంచాయతీరాజ్, శిశుసమగ్ర శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో అధికారుల కోసం ఏర్పాటుచేసిన కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

బాల కార్మికులను ప్రోత్సహించొద్దు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

బాల కార్మికులను ఎవరూ ప్రోత్సహించవద్దని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వై.సురేష్ కోరారు. పట్టణంలో ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా సోమవారం వాణిజ్య సముదాయాలు, షాపింగ్ మాల్స్‌లో బాల కార్మికులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో కార్మిక శాఖాధికారి వెంకటరావు, మహిళా పోలీస్ స్టేషన్, ఐసిడిఎస్, బాలల సంరక్షణ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురంలో రెవెన్యూ సదస్సు


ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో సోమవారం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి 8 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, నాయకులు సొంటేన రాజేష్, మండల సర్వేయర్ రమణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ తిరుపతిరావు, విఆర్ఒ జయరాం, పంచాయతీ కార్యదర్శి కిశోర్, గ్రామ సర్వేయర్ తేజేశ్వరి, ఉప సర్పంచ్ కిశోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 17 నుంచి 20 వరకు సర్పంచుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. 17, 18న ఒక బ్యాచ్, 19, 20న రెండో బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. సర్పంచులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాసరావు, వరప్రసాద్

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని జోగింపేట ఎస్‌సి కాలనీకి చెందిన నల్ల సూర్యనారాయణ బ్రెయిన్ సర్జరీ కోసం ఎస్ఎస్‌టిపి సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం 20 వేలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు టంకాల శ్రీనివాసరావు, పోల వరప్రసాద్, ఎం.తాతబాబు పాల్గొన్నారు.

విద్య, నైపుణ్యాభివృద్ధి కోసమే స్కిల్‌హబ్

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులకు విద్యతోపాటు పరిశ్రమలకు తగిన నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని సృష్టించడం కోసమే స్కిల్‌హబ్ ఏర్పాటైనట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలోని స్కిల్‌హబ్ సెంటర్, గర్భిణుల వసతిగృహంతోపాటు రస్తాకుంటుబాయిలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ముందుగా స్కిల్‌హబ్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. యువత మరింత సృజనాత్మకంగా ఆలోచనలు చేయాలని, ఇందుకు నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. తద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. ఇటువంటి నైపుణ్య శిక్షణ కార్యక్రమాల ద్వారా యువతలో నైపుణ్యం, పరిజ్ఞానం పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. మరింత సృజనాత్మకంగా ఆలోచించేలా యువతను తీర్చిదిద్దాలని శిక్షకులను కలెక్టర్ ఆదేశించారు. శిక్షణకు అవసరమైన అన్ని మౌలికవసతులు ఉండాలని, అవసరమైతే మరిన్ని గదుల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

అనంతరం గుమ్మలక్ష్మీపురం వైటిసిలోని గర్భిణుల వసతి గృహాన్ని సందర్శించారు. పరిసరాలను స్థితిగతులను కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవలు, సదుపాయాలపై అక్కడ గర్భిణులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సకాలంలో మందులు, వ్యాక్సిన్లు అందిస్తున్న తీరును గురించి వాకబుచేశారు. తమకు ఎటువంటి సమస్యలూ లేవని, సమయానుకూలంగా అన్ని సదుపాయాలు అందుతున్నాయని గర్భిణులు తెలిపారు. వసతిగృహంలో ఎటువంటి సమస్యలూ తలెత్తరాదని, ముందుగానే మందులు, వ్యాక్సిన్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్.. సిబ్బందిని ఆదేశించారు. సకాలంలో వైద్యులు పరీక్షలు చేసి, సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం రస్తాకుంటుబాయి గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ జీడిపప్పు ప్రాసెసింగ్, నాటు కోళ్ల పెంపకం తదితర యూనిట్లను పరిశీలించారు. ఈ యూనిట్ల ద్వారా మహిళలకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనల్లో సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి ఎం.వినోద్‌కుమార్, తహశీల్దార్ శివన్నారాయణ, ఎంఇఒ చంద్రశేఖర్, పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎపిఒ చినబాబు

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 43 వినతులు

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో ఎపిఒ జి.చిన్నబాబు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 43 అర్జీలు అందాయి. ఐటిడిఎ పరిధిలోని గిరిజనులు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, పిహెచ్ఒ వెంకట గణేష్, వెలుగు ఎపిడి సన్యాసిరావు, డిప్యూటీ డిఇఒ నారాయుడు, సిడిపిఒ పి.రంగలక్ష్మి, డిపిఎం రమణ, జిసిసి మేనేజర్లు కృష్ణ, నరసింహులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పాఠశాల ఆయాలు, సిఐటియు నాయకులు

ఆయాలకు పెండింగ్ జీతాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ ఆయాలకు పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆ యూనియన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శాంతికుమారి మాట్లాడుతూ స్కూల్లో ఆయాలకు ఐదు నెలలుగా జీతాలు లేకపోవడంతో వారు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతభత్యాలు పెంచాలని కోరారు. కనీస మౌలిక సదుపాయాలు, మాస్కులు బ్లౌజులు, యూనిఫాం, గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, రమణారావు, ఆ యూనియన్ నాయకులు కళావతి, సీతమ్మ, రజిని, లక్ష్మమ్మ, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ రాణి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

బాలికల్లో రక్తహీనత నివారించే కిశోర వికాసం కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలని ఐసిడిఎస్ పీడీ ఎంఎస్ రాణి కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్ పిఒ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 11 నుంచి 18 ఏళ్ల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసుకోకూడదని చెప్పారు. 18ఏళ్లలోపు వివాహాలు చేస్తే పోలీస్ స్టేషన్లో గాని, ఐసిడిఎస్ అధికారులకు గాని సమాచారం అందించాలని సూచించారు.

ఆడపిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్ఒ జగన్మోహన్ మాట్లాడుతూ హెల్త్ అండ్ న్యూట్రిషన్, రక్తహీనత, కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రూపేష్, ఎంఇఒ ప్రసాదరావు, జిల్లా బాలల సంరక్షణాధికారి ఎ.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


నీటి సంఘాల ఎన్నికల్లో

టిడిపి అధికార దుర్వినియోగం

సజావుగా జరిగితే వైసిపిదే విజయం : మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి -సాలూరు

ఇటీవల జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో టిడిపి కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, అధికార యంత్రాంగాన్ని ఏకపక్షంగా వాడుకుందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో కలిసిన పురోహితునివలస నాయకులతో మాట్లాడారు. ఈ గ్రామ నీటిసంఘం ఎన్నికల్లో మెజారిటీ లేకపోయినా టిడిపిని గెలిపించడానికి ఎన్నికల అధికారి వ్యవహరించిన తీరును ఆయనకు వారు వివరించారు. నీటి సంఘం ఓటర్లలో 95 శాతం మంది వైసిపి మద్దతుదారులుగా కనిపిస్తున్నా ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల అధికారి ఇష్టపడలేదని చెప్పారు. అధికారపార్టీ నాయకుల ఒత్తిడి మేరకు ఎన్నిక వాయిదా వేయించడానికి శతవిధాలా ప్రయత్నించారని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఎన్నిక నిర్వహించకుండా తాత్సారం చేస్తున్న సమయంలో మీడియా ప్రతినిధులు అక్కడకు చేరుకోవడంతో ఎన్నిక నిర్వహించారని తెలిపారు. దీనిపై రాజన్నదొర మాట్లాడుతూ నీటి సంఘం ఎన్నికలు నిజాయితీగా జరిగిన చోట వైసిపి గెలిచిందన్నారు. అధికార యంత్రాంగం పూర్తిగా లోబడిన ప్రదేశాలలో టిడిపి విజయం సాధించిందని చెప్పారు. పురోహితునివలసలో జరిగిన విధంగా ఎన్నిక సజావుగా రాష్ట్ర మంతటా జరిగితే వైసిపి అభ్యర్థులే విజయం సాధిస్తారని స్పష్టంచేశారు. నీటి సంఘాల ఎన్నికలు బహిష్కరించాలని వైసిపి నిర్ణయించినా అధికారపార్టీ దౌర్జన్యాలను ఎదురించి పోటీ చేసిన చోట వైసిపి గెలిచిందని రాజన్నదొర చెప్పారు.



టిడిపి నాయకులను సత్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

విజేతలకు మంత్రి అభినందన

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం రావాడ ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు సాగునీటి సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన టిడిపి అభ్యర్థులను మంత్రి సంధ్యారాణి అభినందించారు. సోమవారం వారంతా సాలూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గెలుపునకు కృషి చేసిన నాయకులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, నాయకులు అంబటి రాంబాబు, నందివాడ కృష్ణబాబు, గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, జోగి భుజంగరావు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి -సీతానగరం

పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిడిఒ త్రివిక్రమరావు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం సచివాలయ కార్యదర్శులు, సిబ్బందితో ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పనులు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్.వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ పూర్ణిమ పాల్గొన్నారు.

గరుగుబిల్లి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం గ్రామీణాభివృద్ధిపై సర్పంచులు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఎంపిపి రామారావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాల్సి ఉందన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, సర్పంచులు బొత్స అప్పడు, కరణం రవీంద్ర, గులిపల్లి నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అరటి నారతో సంపద

ప్రజాశక్తి -మక్కువ

అరటి నార నుంచి సంపద సృష్టించవచ్చని ఉద్యానశాఖాధికారి ప్రత్యూష బాను తెలిపారు. మండలంలోని మార్కొండ పుట్టి పంచాయతీలో సోమవారం అరటి బోదుల నుండి నార తీసే ప్రక్రియపై మహిళా సంఘాలకు, రైతులకు ఆమెతోపాటు వెలుగు సిసి అనిల్ కుమార్ అవగాహన కల్పించారు. అరటి మొదళ్లను వృథా కాకుండా దాని నుండి సంపద ఏ విధంగా సృష్టించుకోవాలన్న అంశాలపై వివరించారు. మహిళా సంఘాల ద్వారా ఈ ప్రక్రియ చేసుకుంటే యంత్రాలు సమకూర్చుతామని, వ్యక్తిగతంగా రైతులు శ్రద్ధ చూపితే వారి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విహెచ్ఎ సత్యవతి, విఒ గంగాడ అనిత, టిడిపి నాయకులు బొంగు వాసుదేవరావు పాల్గొన్నారు.

చిన్నాకు ఎమ్మెల్యే పరామర్శ



చిన్నాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ నాయకులు మహేశ్వర చిన్నాను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం పరామర్శించారు. ఆయన ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడంగి రామారావు, అడ్డాకుల నరేష్, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

బకాయిలున్న షాపులకు తాళాలు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

మున్సిపల్ వాణిజ్య సముదాయంలో బకాయిలున్న షాపులకు సోమవారం రెవెన్యూ అధికారి రూబెన్ ఆధ్వర్యాన ఆర్ఐ ఈశ్వరరావు, సిబ్బంది తాళాలు వేశారు. 2, 7, 23 దుకాణాల లీజుదారులు రూ.10 లక్షలు బకాయిలు ఉన్నప్పటికీ సకాలంలో అద్దెలు చెల్లించకపోవడంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు ఆదేశాల మేరకు వారు తాళాలు వేశారు. బకాయిలను మున్సిపల్ కార్యాలయానికి స్వచ్ఛందంగా వచ్చి చెల్లించాలని, లేకుంటే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారి తెలిపారు.



తాళాలు వేస్తున్న అధికారులు

ఆర్చరీలో గిరిజన విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -సీతంపేట

ఆంధ్ర వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో దోనుబాబు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎ.కిరణ్, సవర సూర్యం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. టీమ్ ఛాంపియన్‌షిప్ కూడా దోనుబాయి పాఠశాల విద్యార్థులు సాధించారు. ఈ నెల 24న చత్తీస్‌గడ్ నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు కిరణ్, సూర్యం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం క్రీడాకారులను ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, హెచ్ఎం సుకుమార్, డిప్యూటీ వార్డెన్ సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్.సి.రెడ్డి, దిలీప్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు

సీతానగరం రైతుకు ప్రకృతి సేద్య అవార్డు



అవార్డు అందుకుంటున్న మోహనరావు

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలో కె.వెంకటాపురానికి చెందిన రైతు బుడితి మోహన్‌రావుకు ప్రకృతి సేద్య పురస్కారం లభించింది. ప్రకృతి సాగు పద్ధతిలో మోహనరావు మూడేళ్ల నుంచి కులాకర, నవారా, మైసూరు, మైసూరు మల్లిక వంటి దేశీయ వరి విత్తనాలతో వ్యవసాయం చేస్తున్నారు. అందుకు గాను ఆంధ్రా యూనివర్శిటీలో నిర్వహించిన ఆర్గానిక్ మేళాలో ఆయన్ను సన్మానించారు. ఇందులో ప్రకృతి వ్యవసాయం సీతానగరం యూనిట్ ఇన్‌ఛార్జి ఎన్.గంగరాజు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి -మక్కువ

మక్కువ, సాలూరు మండలాల పరిధిలో రెండు రోజులపాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఇఇ కె.గోపాలరావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మావుడి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి చింతలవలస ఫీడర్ పై, 33 కెవి మామిడిపల్లి నుండి మావుడి ఫీడర్ పై ఆర్‌డిఎస్ఎస్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. దీంతో మంగళ, బుధవారాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్తు నిలిపి వేయనున్నట్లు వివరించారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలస జంక్షన్ వద్దనున్న సత్యసాయి అన్నపూర్ణ నిత్య సేవా కేంద్రంలో మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల ఉన్న కంటి రోగులు వినియోగించుకోవాలని కోరారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

వాహనదారులకు ధ్రువపత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. సోమవారం మూలిగూడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అనంతరం మద్యం సేవించి, హెల్మెట్, సీటు బెల్ట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.